# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. అంతర్జాతీయ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్రూనై దేశంలో పర్యటించారు.
2. వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
3. విజయవాడకు భవిష్యత్తులో వరద ముంపు సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు.
4. తెలంగాణలో భారీ వర్షాల వల్ల మృతి చెందిన వారి కుటుంబాలకు 5లక్షల చొప్పున నష్ట పరిహారాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.
5. ఆంధ్రప్రదేశ్‌లోని వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను చేపడుతున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు.
6. ఉబయ తెలుగు రాష్ట్రాల్లో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

==========================

అంతర్జాతీయ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న బ్రూనైలోని బందర్ సేరి బెగవాన్‌కు చేరుకున్నారు. ఆయనకు బ్రూనై యువరాజు హాజీ అల్ ముహ్తాదీ బిల్లా ఘనస్వాగతం పలికారు బ్రూనైలో భారత హైకమిషన్ కొత్త ఛాన్సరీ ప్రాంగణాన్ని ప్రధాన మంత్రి నిన్న ప్రారంభించారు. హాజరైన ప్రవాస భారతీయ సభ్యులతో ప్రధానమంత్రి సంభాషించారు. ఇరు దేశాల మధ్య సజీవ వారధిగా, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు వారు అందిస్తున్న సహకారాన్ని ఆయన అభినందించారు. బ్రూనైలో భారత ప్రధానమంత్రి ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే తొలిసారి. భారత్-బ్రూనై దేశాల మధ్య దౌత్య సంబంధాలకు 40 యేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి ఈ పర్యటన చేపట్టారు. కాగా ప్రధానమంత్రి ఈ రోజు సింగపూర్‌లో పర్యటిస్తారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గత రాత్రి ఆయన విజయవాడలో నిర్వహించిన పాత్రికేయుల

సమావేశంలో మాట్లాడుతూ, విజయవాడకు భవిష్యత్తులో ఎలాంటి నష్టం జరగకుండా ఉండేలా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను శుభ్రం చేయించి, రహదారులపై బురద తొలగింపు పనులు చేపడతామని వివరించారు. వరద బాధితుల కోసం, ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ,

వాయిస్ (30 సెకన్లు)

కాగా.. ముఖ్యమంత్రి ఈరోజు కృష్ణానది పరివాహక ప్రాంతంలోని విజయవాడ, రేపల్లె ముంపు ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించనున్నారు.

---

విజయవాడకు భవిష్యత్తులో వరద ముంపు సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోనున్నామని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని గుంటూరు జిల్లా తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ కమిషనర్ కార్యాలయం నుంచి నిన్న ఆయన పరిశీలించి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ముంపు సమస్య తలెత్తకుండా నగరానికి ఒక బృహత్ ప్రణాళిక అవసరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి తలెత్తకుండా వరద నీరు బయటకు వెళ్లేలా కాలువలు ఏర్పాటు చేయాలని దీనిపై ముఖ్యమంత్రితోనూ చర్చిస్తామని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ,

వాయిస్ ( 26 సెకన్లు)

---

తెలంగాణలో భారీ వర్షాల వల్ల మృతి చెందిన కుటుంబాలకు 5లక్షల రూపాయల చొప్పున నష్ట పరిహారాన్ని అందిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన.. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కతో కలిసి వరదలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైందని, దాదాపు 30వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని తెలిపారు. సహాయక చర్యల్లో నిరంతరం పనిచేసిన రెవెన్యూ, పోలీసు సిబ్బందిని అభినందించారు. ముందస్తు చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగామని, పంట నష్టం అంచనా వేసి పరిహారం అందజేస్తామని చెప్పారు. వర్షం తగ్గినందున బురద తొలగించే పనులు అధికారులు ప్రారంభించాలని, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---

వరద ముంపు ప్రాంతాల్లో బాధితులను సురక్షిత ప్రాంతాలకు నిరంతరాయంగా తరలించామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. వరద సహాయక చర్యలపై మంత్రి నిన్న అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ వరద బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశామని. ఇప్పటివరకు 8.5లక్షల టిఫిన్ ప్యాకెట్లు, 8.5లక్షల మందికి అల్పాహారం, ఆహార పొట్లాలు పంపిణీ చేశామన్నారు. వరద నీరు తగ్గిన తర్వాత రోడ్లపై మురుగునీరు లేకుండా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీల కమిషనర్లకు వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని మంత్రి పేర్కొన్నారు.

-------------------------

కృష్ణానది వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లాలో వరద ప్రభావిత లంక గ్రామాలలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వరద పరిస్థితిపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ కరకట్ట బలహీనపడిన ప్రాంతాలను పరిశీలించి లంక గ్రామాలలో విద్యుత్ పునరుద్ధరణకు 1000 మంది విద్యుత్ సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ లంక గ్రామాలలోని ప్రజలకు తాగునీరు, వైద్యం, భోజనం సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంటువ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి తెలిపారు.

-------------------------

తెలంగాణలో భారీ వర్షాలు, వరదలకు 1,53,278 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. అన్ని జిల్లాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో రైతులు కొత్త పంటలు వేసుకునేందుకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుతామని మంత్రి పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు రోజుల పాటూ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. రేపు పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని మరో అల్పపీడనం ఏర్పడనుందని తెలిపింది. ఋతుపవన ద్రోణి ప్రభావంతో ఉపరితల ఆవర్తనం కోస్తాంధ్ర మీదుగా కొనసాగుతోందని.. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని ఈ రెండు జిల్లాలకు నారింజ రంగు ప్రమాద హెచ్చరికలు జారీ చేశామని వాతావరణ శాఖ తెలిపింది. కాగా గత రాత్రి నుంచి విజయవాడ, గుంటూరు నగరాలలో వర్షాలుకురుస్తున్నాయి.

మరోవైపు.. తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న రెండు రోజుల పాటు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు వాతావరణ శాఖ ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది.

=====================